

## వణికిస్తోన్న చలి

హైదరాబాద్, నవంబరు 21 ప్రభాతవార్త : నగరాన్ని చలి వణికిస్తోంది. డిసెంబరు రాకముందే నగర శివారు ప్రాంతాల్లో మంచు దుప్పటి కప్పుకుంటోంది. చలి తీవ్రత అనూహ్యంగా పెరుగుతుండడంతో రాత్రిపూట ఉష్ణోగ్రతలు కనిష్టస్థాయికి పడిపోతున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు తగ్గుతుండటంతో ఉదయం, రాత్రి పూట ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. సాధారణం కన్నా 4 నుంచి 6 డిగ్రీల వరకు తక్కువ టెంపరేచర్లు నమోదవుతున్నాయి. సోమవారం నగరంలో 13.7 డిగ్రీలు నమో దయ్యాయి. ఉదయం 10 గంటలు దాటినా చలితో వాహనదారులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ఇదే విధంగా ఉష్ణోగ్రతలు తగ్గితే.. పాత రికార్డులు చెరిగిపోయే అవకాశం ఉందంటున్నారు వాతావరణ శాఖ అధికారులు. గాలులు వీస్తుండటంతోనే చలి తీవ్రత పెరుగుతుందంటున్నారు.బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడింది. దీంతో చలితీవ్రత పెరిగి, ఆకాశం మేఘావృతమైందని పేర్కొంటున్నారు.




# హైదరాబాద్ వార్త


# అరకొర టీచర్లు.. వెక్కిరిస్తున్న ఖాళీలు

**ఇంచార్జ్‌లతో డిప్యూటీ డిఈవో, డిఐఎస్ పోస్టులు**

**ప్రధానోపాధ్యాయులకే అదనపు బాధ్యతలు**

**వెంటాడుతున్న సబ్జెక్ట్ టీచర్ల కొరత**



హైదరాబాద్, నవంబర్ 21, ప్రభాతవార్త: హైదరాబాద్‌లో విద్యాశాఖ పరిస్థితి ఘోరంగా తయారైంది. విద్యాసంస్థలపై పర్యవేక్షణ కొరబడి ఇష్టారజ్యంగా మారింది. డిప్యూటీ డిఈవోలతోపాటు ఐఓస్ రెగ్యూలర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రధానోపాధ్యాయలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. మరోవైపు సబ్జెక్టు టీచర్ల పోస్టులు ఖాళీగా వెక్కిరిస్తుండటంతో బోధనా సామర్థ్యాలు తగ్గిపోయాయి. కనీసం విద్యాశాఖ వాలంటీర్ల భర్తీ ప్రక్రియ కూడా పెండింగ్‌లో ఉండటంతో ముఖ్య సబ్జెక్ట్‌ల బోధన సమస్య ఎక్కువైంది. ఉపాధ్యాయులు కొరతతో కేవలం పదోతరగతి పైనే దృష్టి సారించి మిగతా తరగతులపై దృష్టి చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కింది తరగతుల విద్యార్థులకు సబ్జెక్టులపై కనీస అవగాహన కొరబడింది. ముఖ్యంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాశాలలపై పర్యవేక్షణ కొరవడింది. రెగ్యూలర్ డిప్యూటీ టీఈవోలు, ఐఓఎస్ పోస్టుల ఖాళీల భర్తీ లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. కొంతకాలంగా పదోన్నతుల ప్రక్రియ పెండింగ్‌లో పడిపోవడంతో అర్హులు ఉన్నా భర్తీ కాని పరిస్థితి ఉంది. జిల్లాలోని 16మండలాల్లో 12రెగ్యూలర్ డిప్యూటీ డీఈఓ పోస్టులుండగా.. అన్ని ఇంచార్జ్‌లతో కొనసాగుతున్నాయి. మరో 24డిప్యూటీ ఐఓఎస్ పోస్టుల్లో సుమారు ఏడు ఖాళీగా ఉన్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రధానోపాధ్యాయులకు అదనపు బాధ్యతలు భారంగా మారాయి. ఒక్కో హెడ్‌మాస్టర్‌కు మూడు నుంచి నాలుగు మండలాలు అప్పగించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తుంది. అయితే అదనపు బాధ్యతలు అప్పగించినా కొందరు దూరంగా ఉన్నట్లు తెలుస్తుంది.

**వెంటాడుతున్న టీచర్ల కొరత..** పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత వెంటాడుతుంది. హైదరాబాద్ జిల్లాలో 690 పాఠశాలలు ఉండగా అందులో గణితం, ఫిజికల్‌సైన్స్, బయాలజీకల్ సైన్స్ బోధించే టీచర్ల కొరత చాలా ఉంది. దీంతో ఇతర లాంగ్వేజ్ టీచర్లే ఆ పాఠాలను కూడా బోధిస్తు నెట్టుకొస్తున్నారు. ముఖ్యంగా చార్మి నార్, బహదూర్‌పురా, ఆసిఫ్‌నగర్, కాచిగూడ ప్రాంతాల్లో ప్రధాన సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయలు లేకపోవడంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### 'భారతం పంచనాయకం' గ్రంథాల ఆవిష్కరణ

చిక్కడపల్లి, నవంబరు 21 ప్రభాతవార్త: శ్రీమానస ఆర్ట్ థియేటర్స్, సాహితీ జిగీష, త్యాగరాయ గాన సభ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.ఉమాశశి రచించిన 'వర్తమాన తెలుగు దినపత్రికలలో భాషా విశేషాలు', 'భార తం పంచనాయకం' గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం రాత్రి మరుమాముల దత్తాత్రేయ శర్మ అధ్యక్షతన చిక్కడపల్లి శ్రీ త్యాగ రాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. ముఖ్యఅతి థులుగా ఉస్మానియా విశ్వ విద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఆచార్య స్వరాజ్య లక్ష్మి గ్రంథాలను ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో త్యాగ రాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి, తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఆచార్య వెల్దండ నిత్యానంద రావు, మానస ఆర్ట్స్ అధ్యక్ష, కార్యదర్శులు బండారుపల్లి రామచంద ర్‌రావు, కవి రఘుశ్రీ, సాహితీ జిగీష కార్యదర్శి డాక్టర్ పి.లలితవాణి తదితరులు పాల్గొన్నారు.

# విదేశీ విద్యపై విద్యార్థుల చూపు




హైదరాబాద్, నవంబరు 21 ప్రభాతవార్త : భారతీయులు ఉన్నత విద్యకు విదేశాలకు వెళ్లడం శతాబ్దాల నుంచి ఉన్నదే. అయితే ధనవంతుల పిల్లలను మాత్రమే విదేశీ చదువనే పరిస్థితి మాత్రం నేడు మారింది. మద్య, దిగువ మద్య తరగతి కుటుంబాలు సైతం ప్రతిభ ఉన్న తమ పిల్లల్ని విదేశాల్లో చదివించేందుకు ప్రోత్సహిస్తున్నాయి. విదేశాల్లో చదువుకుంటే ఐటి రంగంలో మంచి వేతనంతో అక్కడే స్థిరపడవచ్చనే అవిషయాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులు భావిస్తున్నారు. ఇందుకోసం తనకున్న కొద్దిపాటి ఆస్తుల్ని విక్రయించడానికి వెనుకాడడం లేదు. బ్యాంకులూ ఇబ్బందులు పెట్టకుండా విద్యారుణాలు ఇస్తుండడం కనిపిస్తోంది. విదేశాల్లో ఎంఎస్ పూర్తిచేస్తే, ఐటి రంగంలో మంచి కొలువులు దక్కుతాయని, రెండు, మూడేళ్ళలోనే ఆ అప్పులన్నీ తీర్చవచ్చనే నమ్మకం. వారిని ఆ దిశగా అడుగులు వేయిస్తోంది. ఇటీవలనే నిర్వహించిన ఓ తాజా సర్వేలో మద్యతరగతి కుటుంబాల్లో 57శాతం మంది తమ పిల్లలను విదేశాల్లో చదివించాలనుకుంటున్నారని వెల్లడైంది. మొత్తానికి తమ భారతీయ విద్యార్థులు పొరుగు దేశమైన చైనాను అధిగవమించి అమెరికాతోపాటు కెనడా, యూకే, ఆస్ట్రేలియా, ఇతర యూరప్ దేశాలకూ నేడు ఉన్నత విద్య కోసం పరుగులు పెడుతున్నారు. ఈ ఏడాది తొలిసారిగా చైనా కంటే భారతీయ విద్యార్థులకే యూకే అధికంగా స్టడీ వీసాలు జారీచేసింది. ఇప్పటివరకు అమెరికాలో చైనా విద్యార్థులదే ఉన్న మొదటిస్థానాన్ని అధిగమించడానికి భారత్ ఎంతో దూరంలోలేదని నిపుణులు అంచనావేస్తున్నారు. కాగా భారత్ నుంచి విదేశాల్లో చదువుకుంటున్న వారిలో తెలుగు రాష్ట్రాల వాటా 20 నుంచి 25 శాతం ఉంటుందని, ప్రస్తుతం 12 లక్షల మంది భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుతుండగా, ఆ సంఖ్య 2025 నాటికి 20లక్షలకు చేరుకుంటుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అమెరికా ఈ ఏడాది భారతీయ విద్యార్థులకు రికార్డుస్థాయిలో 82వేల విద్యార్థి(ఎఫ్-1) వీసాలు జారీ చేసింది. అందులో అధికశాతం మే-ఆగస్టు మధ్య మంజూరు చేసింది. అమెరికాలోని అంతర్జాతీయ విద్యార్థుల్లో చైనా తర్వాత భారత్‌ది రెండవ స్థానం. కెనడా విషయానికి వస్తే ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో 60,258 మంది భారత్ విద్యార్థులు ఆ దేశానికి వెళ్లారు. 2019లో 1,32,620 మంది అక్కడికి వెళ్లగా, 2020లో కరోనాతో ఆ సంఖ్య 43,624కు పడిపోయింది. తిరిగి 2021లో 1,02,688కి పెరిగింది. ఈసారి 2019 కంటే కెనడా వెళ్లే విద్యార్థులు పెరుగుతారని అంచనావేస్తున్నారు. ఈ దేశానికి వెళుతున్న విద్యార్థుల సంఖ్య 2016-2021 మధ్య 220 శాతం పెరగడం గమనార్హం. ఇక యూకె విషయానికి వస్తే గత ఏడాది పొల్చుకుంటే భారతీయులకు విద్యార్థి వీసాలు 89శాతం పెరిగాయని చెప్పవచ్చు. ఈసారి రికార్డు స్థాయిలో 2021 జూలై నుంచి 2022 జూన్ వరకు 1,17,965 స్టడీవీసాలు జారీ చేసింది. ఇప్పటివరకు ఈ వీసాలు పొందడంలో చైనా అగ్రగామిగా ఉండగా, ఈ సారి భారత్ ఆ స్థానాన్ని దక్కించుకుంది. ఇక ఆస్ట్రేలియాలో అంతర్జాతీయ విద్యార్థులు 2,60లక్షల మంది చదువుతుండగా వారిలో భారత్ విద్యార్థులు దాదాపు సంగం మంది ఉన్నారు. మన దేశ విద్యార్థుల సంఖ్య 2025 నాటికి 20వేలకు పెంచుకోవాలని ఇటీవలే ఫ్రాన్స్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. జర్మనీ, ఫిన్‌లాండ్, ఐర్లాండ్ తదితర దేశాలు సైతం భారతీయ విద్యార్థులను పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా మహిళలు సైతం విదేశీ విద్యపై అత్యంత ఆసక్తి చూపుతున్నారు. ఏడేళ్ళపాటు తమదేశంలో ఉంటే గ్రీన్‌కార్డు ఇస్తామని అమెరికా ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది కనుక అమలులోకి వస్తే మరింత మంది ఆ దేశానికి భారతీయ విద్యార్థులు విదేశీ విద్య కోసం తరలివెళ్ళే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిఏ తనయుడి ఆత్మహత్య

**గతంలో మృతుడిపై మహబూబ్‌నగర్‌లో కేసు నమోదు**



సంఘటనా స్థలిలో అక్షయ్‌కుమార్ మృతదేహం

గచ్చిబౌలి, నవంబరు 21 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పీఏ తనయుడు కొండాపూర్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని చెప్పి గతంలో మహబూబ్‌నగర్‌లోని కొంతమంది వద్ద డబ్బులు వసూలు చేయడంతో వృతుడిపై కేసు నమోదు కాగా, ఈ కేసు విషయమై మనస్థాపంతోనే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అక్షయ్‌కుమార్(23)కు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో గత పదిహేను రోజుల క్రితం నగరానికి వచ్చి కొండాపూర్‌లోని సెంట్రల్ పార్కు కాలనీలో వరుసకు అక్క అయ్యే వారి ఇంట్లో ఉంటున్నాడు. అక్షయ్‌కుమార్ తండ్రి దేవేందర్ తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వద్ద పర్సనల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. కాగా గత రెండు,మూడు నెలల క్రితం అక్షయ్‌కుమార్ మీద మహబూబ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఓ కేసు నమోదైంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేయిస్తానని చెప్పి పలువురి వద్ద అక్షయ్‌కుమార్ డబ్బులు తీసుకున్నట్లు బాధితులు పోలీసులకు పిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ కేసు అనంతరం ఉద్యోగం రావడంతో అక్షయ్‌కుమార్ గత పదిహేను రోజుల క్రితం నగరానికి వచ్చాడు. కాగా సోమవారం ఉదయం సెంట్రల్ పార్కులోని తాను ఉంటున్న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని అక్షయ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యాహ్నం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు విషయం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా గతంలో మహబూబ్‌నగర్‌లో నమోదైన కేసు, ఆర్థిక లావాదేవీలతో మనస్థాపానికి గురై అక్షయ్‌కుమార్ ఆత్మహత్య చేసుకొని ఉంటాడనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోస్టుమార్టం నివేదిక, పూర్తి విచారణ అనంతరం మరిన్ని వివరాలు తెలుస్తాయని గచ్చిబౌలి ఇన్స్‌పెక్టర్ సురేష్ తెలిపారు.

# షార్ట్ సర్క్యూట్‌తో రెండు ప్రైవేట్ బస్సులు దగ్ధం



షార్ట్ సర్క్యూట్ వల్ల రెండు ప్రైవేట్ బస్సులు దగ్ధమైన చిత్రం

చార్మినార్, నవంబరు 21 ప్రభాతవార్త : షార్ట్ సర్క్యూట్ కారణంగా పాతబస్తీ కిషన్‌బాగ్ నందిముస్లాయిగూడలోని పార్కింగ్‌లో రెండు ప్రైవేట్ బస్సులు దగ్ధమైన సంఘటన సోమ వారం బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. టోలీచౌక్‌లోని డిఫెన్స్‌కాలనీకి చెందిన మహ్మద్ సలీంకు ప్రైవేట్ బస్సు ఉంది. వివాహాలకు, టూర్‌లకు బస్సును అద్దెకు ఇస్తున్నారు. ఆదివారం రాత్రి పది గంటల సమయంలో డ్రైవర్ బస్సును నందిముస్లాయిగూడలోని పార్కింగ్ వద్ద బస్సును పార్క్ చేసి ఇంటికి వెళ్లి పోయాడు. కాగా హసన్‌నగర్‌కు చెందిన సయ్యద్ మొయినుద్దీన్‌కు చెందిన ప్రైవేట్ బస్సును డ్రైవర్ రాత్రి పదకొండు గంటల సమయంలో పార్కింగ్ చేశాడు. సోమవారం తెల్లవారు జామున మూడు గంటల సమయంలో మహ్మద్ సలీంకు చెందిన బస్సు నుంచి చిన్న మెరుపు వంటి మంటలు వచ్చాయి. కొంత సేపటి తర్వాత ప్రక్కనే ఉన్న సయ్యద్ మొయినుద్దీన్‌కు చెందిన ఏసి బస్సుకు కూడ మంటలు అంటుకున్నాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు ప్రైవేట్ బస్సులు కాలి పోయాయి. సమాచారం అందుకున్న బహదూర్‌పుర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అగ్ని మాపక కేంద్రాన్ని రప్పించి మంటలను ఆర్పివేశారు. కాలి పోయిన రెండు బస్సుల ఆస్తి విలువ దాదాపు పన్నెండు లక్షల రూపాయలు వరకు ఉంటుందని బస్సుల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. షార్ట్ సర్క్యూట్ వల్ల లేదా గ్యాస్ వల్ల అగ్ని ప్రమాదం జరిగిందా అన్న విషయాన్ని బహదూర్‌పుర ఇన్‌స్పెక్టర్ సుధాకర్ పర్యవేక్షణలో ఎస్ఐ మల్లారెడ్డి అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

### మత్తు పదార్థాలకు బానిసకావొద్దు

చిక్కడపల్లి, నవంబరు 21 ప్రభాతవార్త: యువత, విద్యా ర్థులు మత్తు పదార్థాలకు బానిసలై ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, ఇటువంటి వాటికి దూరంగా ఉండాలని చిక్కడపల్లి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్‌కుమార్ అన్నారు. నాగమయ్యకుంట బస్తీలో మత్తు పదార్థాల వాడకం వల్ల జరిగే అనర్థాలు, ఇబ్బందులపై ప్రజలోన్ల అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎవరైనా మత్తు పదార్థాలను డ్రగ్స్‌ను అమ్మితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. చిక్కడపల్లి పోలీసుస్టేషన్ ఎస్ఐ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తా

**ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి**



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న జనార్ధన్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, నవంబర్ 21,ప్రభాతవార్త : ఉపాధ్యాయుల సంక్షేమానికి అహర్నిశలు కట్టుబడి ఉంటానని ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు పర్యాయాలుగా ఎమ్మెల్సీగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించానని అందరి మన్ననలు పొందానని అన్నారు. అయితే నాకు ఆరోగ్యం బాగా లేదని, పోటీచేయడం లేదంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని వాటిని నమ్మొద్దన్నారు. మరో సారి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయుల నియోజకవర్గం నుంచి స్వంత్రంగా ఎన్నికల బరిలో నిలుస్తున్నాని ప్రకటించారు. గతంలోనూ ఎమ్మెల్సీగా ఉపాధ్యాయులకు సంబంధించిన అనేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించానన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న తనను మరోసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిలబడాలని ఉపాధ్యాయులందరూ కోరారని, వారందరి అశీస్సులతో పోటీలో నిలుస్తున్నట్లు తెలిపారు.

### ఆంధ్ర ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వకుండా తక్షణమే నిలిపివేయాలి




జిటియస్ కాలనీ విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యులు

యూసుఫ్‌గూడ, నవంబర్ 21, ప్రభాతవార్త : తెలంగాణలో విధులు నిర్వహిస్తున్న ఆంధ్ర ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వకుండా తక్షణమే నిలిపివేయాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ ట్రాన్స్‌మిషన్ కార్యదర్శి గోపికృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక జీటీఎస్ కాలనీ సమీపంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద సోమవారం టీఈఈఏ ఆధ్వర్యంలో ఎర్రగడ్డ స్టోర్ నుంచి సీఈ మెట్రో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపికృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు 24 గంటల పాటు విద్యుత్ ఇవ్వడానికి ఇక్కడ విద్యుత్ అధికారులు, సిబ్బంది ఎంతో కృషి చేశారని తెలిపారు. అలాంటి ఇంజినీర్లకు రివర్షన్లు ఇవ్వడమే కాకుండా కోర్టు తీర్పు పేరుతో ఆంధ్రప్రాంతానికి చెందిన ఇక్కడి ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వడం సరికాదన్నారు. ఇకపై ఒక్క ఇంజినీర్‌కు కూడా రివర్షన్ ఉండకూడదని, ఆంధ్రప్రాంతానికి చెందిన అధికారులకు ప్రమోషన్లు ఇవ్వవద్దని డిమాండ్ చేశారు. ఇకపై తమకు రివర్షన్లు ఇస్తే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఈఈఏ రూరల్ జోన్ కార్యదర్శి మంగారావు, ఎస్ఈ మహేందర్, డీఈలు ఎల్లారెడ్డి, చైతన్య, స్వరూపా, సదానందం, లక్ష్మీకాంత, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

### హృదయానికి హత్తుకునే సాహిత్య ప్రక్రియ గజల్

**జాతీయ కవి సుద్దాల అశోక్‌తేజ**



'హంసగీతి' గజల్ పుస్తకం గజల్ గులాబీలు' పుస్తకాన్ని ఆవిష్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, నవంబరు 21 ప్రభాతవార్త: హృదయానికి హత్తుకునే సాహిత్య ప్రక్రియ గజల్ అని సినీ గేయ రచయిత, జాతీయ కవి సుద్దాల అశోక్‌తేజ అన్నారు. కొమర్రాజు ఫౌండేషన్ అధ్యక్షుడు కేవి.జ్ఞానకుమార్, ఉపాధ్యక్షులు, గజల్ రచయిత్రి డాక్టర్ శ్యామల ఆధ్వర్యంలో 'తెలుగు గజల్ సాహితీ సప్తాహం' కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళావేంకట దీక్షితులు కళావేదికలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అశోక్‌తేజ హాజరై ప్రారంభించి ప్రసంగించారు. ఆచార్య ఎస్వీ.రామారావు అధ్యక్షతన జరిగగిన ఈ కార్యక్రమంలో ప్రధానవక్తగా గజల్ గురువు రెంటాల వెంకటేశ్వరరావు, గజల్‌సాహిత్యం అలతి, అలతి తెలుగు పదాలతో అలరారే ప్రక్రియ..గాన ప్రక్రియగా చెప్పారు. కార్యక్రమంలో భాగంగా 'హంసగీతి' గజల్ పుస్తకం గజల్ గులాబీలు' ఆవిష్కరించారు.

# వీధి దీపాలు వెలగడం లేదు

**జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు న్యాయవాది ఫిర్యాదు**

బేగంపేట, నవంబరు 21, ప్రభాతవార్త : బేగంపేట మయూరి మార్గ్ కమ్యూనిటీ హాలు వెనుక వైపు ఉన్న వీధిలో వీధి దీపాలు రావడం లేదంటూ బేగంపేట మయూరి మార్గ్‌కుచెందిన న్యాయవాది పి.బాలశంకర్ జీహెచ్‌ఎంసీ కమిషనర్, ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ డైరక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసారు. ఎన్నో రోజులుగా 1-10-103బై 1 జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాలు వెనుక లైన్లో వీధి దీపాలు రావడం లేదని, దీనివల్ల ఈ గల్లీలో నివసించే 50 మంది నివాసితులు ఇక్కడ నివాసం ఉంటారని, రాత్రి వేళల్లో ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే ఆ వీధిలో విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని బాలశంకర్ అధికారులకు పంపిన ఫిర్యాదులో కోరారు. గతంలోనూ బాల శంకర్ అనేక ప్రజా అవసరాలపై న్యాయస్థానంలో పిటీషన్లు దాఖలు చేసి ప్రజలకు అవసరమైన పలు పనులను పూర్తి చేయించారు.

## మధుమేహాన్ని నియంత్రణలో పెట్టుకోవాలి

**గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్**



గాంధీ ఆస్పత్రిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డార్టర్ రాజారావు, విజయశేఖర్‌రెడ్డిలు

సికింద్రాబాద్, నవంబర్ 21 ప్రభాతవార్త : ప్రతి ఒక్కరు మధు మేహన్ని అదుపులో పెట్టుకోవడంతో పాటు క్రమం తప్పకుం డా వైద్యులను సంప్రదించాలని సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు తెలిపారు. ప్రపంచ డయాబెటిక్ డే సందర్భంగా పిల్లల్లోని మధు మేహాన్ని నియంత్రణ గురించి తెలుసుకోవడంతో పాటు చికిత్స అందజేసేందుకు ఎండోక్రనాలజీ డిపార్ట్‌మెంట్ విభాగం, నోవోనార్ డిస్క్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సహకారంతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించారు. 19 సంవత్సరాలలోపు పిల్లలకు ప్రత్యేకంగా సదుపాయాలలు కల్పించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ప్రాంగణంలో నిర్వహించిన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా రాజారావు మాట్లాడుతూ మధుమేహ నివారణకు సరైన సమయంలో డాక్టర్‌లను సంప్రతించి మందులు క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. డాక్టర్ విజయశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మధుమేహాన్ని నియంత్రణలో పెట్టుకోవడం చాలా అవసరమని, లేదంటే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. ఈ కార్యాక్రమంలో డిపార్ట్‌మెంట్ డాక్టర్‌లు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి ఎటిఎంలో అగ్ని ప్రమాదం

మూసాపేట, 21, ప్రభాతవార్త : ప్రమాదవశాత్తు విద్యుత్‌ఘాతం ఏర్పడి కూకట్‌పల్లిలోని ఒక ఏటిఎం సెంటర్ పూర్తిగా దగ్ధమైంది. కూకట్‌పల్లి ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న ఏటిఎంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. తెల్లవారు జామున ఈ ఘటన చోటు చేసుకుంది. అగ్ని ప్రమాదంలో పూర్తిగా ఇండస్ ఇండ్ బ్యాంక్ ఏటిఎం కేంద్రం పూర్తిగా దగ్ధమవగా పక్కనే ఉన్న ఇరత బ్యాంకుల ఏటిఎం కేంద్రాలు కూడా పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఏటిఎం ఎదురుగా పార్క్ చేసిన ఓ బైక్ సైతం పూర్తిగా కాలిపోయింది.



ప్రమాదంలో కలిపోయిన దృశ్యం



ఎంటిఎం దగ్ధమైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

## అర్హులైన వారందరికి దళిత బంధు : ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్, నవంబరు 21 ప్రభాతవార్త: అర్హులైన వారందరికి ప్రభుత్వ సంక్షేమ పథకమైన దళిత బంధు అందిస్తామని, ఇందులో దళారుల జోక్యం ఉండకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. దానం ఏర్పాటు చేసిన సమావేశంలో మొదటి, రెండవ దశలో ఉన్న వారంతా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ అన్ని వర్గాల వారికి న్యాయం చేకూస్తున్నారని భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారని దానం స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల్లో మధ్య దళారులు ఉండకుండా చూసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రధానంగా స్థానిక ప్రజా ప్రతినిధిగా తమ బాధ్యతన్నారు. అర్హులైన వారందరికి అవగాహన కల్పించడం కోసం ఒక్క తాటిపన నిలిపేందుకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందన్నారు. స్థానికంగా బస్తీల, కాలనీలలో ప్రధానమైన సమస్యలు పరిష్కరిస్తేనే ఇలాంటి కార్యక్రమాలు మరింత ముందుకు తీసుకువెళతామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సమన్వయంతో సహకరించాలని నాగేందర్ కోరారు. ఇప్పటికే తమ దృష్టికి వచ్చిన సమస్యలు సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కార మార్గం కోసం కృషి చేస్తున్నామని దానం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలు డివిజన్ల అధ్యక్షులు, అభిమానులు, దళితబంధులో ఉన్నవారు ప్రభృతులు పాల్గొన్నారు.

## పేదలు కూడా కార్పొరేట్ వైద్యం పొందాలి

**డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్**



ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాలు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, నవంబర్ 21 ప్రభాతవార్త పేద ప్రజలు కూడా అత్యుత్తమైన కార్పొరేట్ వైద్యం పొందాలనే కాంక్షతోనే కోరిన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి సహాయనిధి అందజేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తెలిపారు. పార్థివాడకు చెందిన కైల్వల మీరవతికి అనారోగ్య కారణంగా సరైన వైద్యం పొందేందుకు ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఆమేచే ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించారు. మంజూరైన నిధులకు సంబంధించిన పత్రాలను సోమవారం సీతాఫల్‌మండిలోని క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అందజేశారు. ఈ కార్యాక్రమంలో సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామలహేమ, గరికపాటి చంద్రశేఖర్, టీఆర్‌టీ శేఖర్, వైవి. బాలాజీ, నవీన్, జాకీర్, అశ్విన్, శైలేందర్, ప్రశాంత్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

## 9 లక్షల వ్యయంతో డ్రైనేజీ పైప్‌లైన్‌కు శంకుస్థాపన



నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కాలేరు వెంకటేష్, అమృత

హైదరాబాద్, నవంబరు 21 ప్రభాతవార్త: నల్లకుంటలోని పాత రామాయణంచారి లైన్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తన ఎమ్మెల్యే నిధుల నుంచి కేటాయించిన 9 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు సోమవారం కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే కాలనీ పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కారించాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పైప్‌లైన్ సమస్యపై ఎమ్మెల్యే తక్షణమే స్పందించి నిర్మాణపు పనులకు శ్రీకారం చుట్టినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, సినీయర్ నాయకులు పశుపులేటి రమేష్, కీషన్‌రావు,ఎం. భూపతినాథ్, అనిల్‌కుమార్, కూర నరేందర్, రాముయాదవ్, అడ్వకేట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు : ఎర్రోళ్ల

కంటోన్మెంట్, నవంబర్ 21 ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలు మృత్యువాత పడకుండా కార్పోరేట్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలంగాణ రాష్ట్ర మెడికల్ ఇన్‌ఫ్రస్ట్రక్టర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తెలిపారు. కంటోన్మెంట్ 5వ వార్డు సంజీవయ్య నగర్‌లో నివాసం ఉంటున్న ఆరెల్ల రమేష్ కుమారుడు చంద్రమౌళికి పుట్టుకతోనే చెవుడు వచ్చింది. వైద్య పరీక్షల నిమిత్తం కాన్‌జెనీ స్ఎల్ డెఫ్‌నెస్ ట్రీట్‌మెంట్ కోసం మంజూరైన రూ.1.75లక్షల ఎల్‌ఓసి పత్రాన్ని సోమవారం ఎర్రోళ్ల చేతుల మీదుగా బాధితుని తండ్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రమౌళి వినికిడి కోసం గత నెలలో రూ. 3.50 లక్షలు ఎల్‌ఓసి ద్వారా ఇప్పించామన్నారు.

## మొరకన్ స్టార్ పురస్కారాన్ని స్వీకరించిన బి.నర్సింగ్‌రావు

సైఫాబాద్, నవంబరు 21 ప్రభాతవార్త: ప్రముఖ దర్శకుడు, రచయిత, చిత్రకారుడు బి.నర్సింగ్‌రావుకు మొరకో దేశం ఇచ్చే అత్యున్నత 'మొరకన్ స్టార్' పురస్కారాన్ని స్వీకరించారు. కోవిడ్ లాక్‌డౌన్‌లో ఆయన గీసిన వేలాది బొమ్మలకు, రాసిన ఆంగ్ల కవిత్వానికి ఈ పురస్కారం లభించింది. తెలంగాణ కళల పునరుజ్జీవన శిల్పిగా అభివర్ణిస్తూ పది జాతీయ పురస్కారాలను, తొమ్మిది అంతర్జాతీయ పురస్కారాలు ఇటీవల కాలంలో ఆయన్ని వరించాయి. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చేసేంతుకు తన వంతు కృషి చేసినట్లు బి.నర్సింగ్‌రావు ఈ మేరకు సోమవారం నాడిక్కడ మీడియాకు తెలిపారు. తన సాంస్కృతిక ప్రయాణంలో విజయవంతం అయినందుకు ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. రంగస్థల, సినిమా, సంగీతం, చిత్రలేఖనం, శిల్పం, సాహిత్యం, జానపదం, ఫోటోగ్రఫీ రంగాలలో ఎన్నో దశబ్దాలుగా తాను చేసిన కృషికి గుర్తింపు లభించిందని సింగపూర్‌కు చెందిన దిలెలైట్ ఫెడరేషన్ ఆఫ్ వరల్డ్ కల్చరల్ అండ్ ఆర్ట్ సూసైటీ తనను గుర్తించి అంతర్జాతీయ సాంస్కృతిక గౌరవ సలహాదారుగా నియమించిందని తెలిపారు. ఆ సంస్థ 160 దేశాలకు విస్తరించిందనిమొరకో దేశం మొరాకన్ స్టార్ పురస్కారంతోపాటు గౌరవ డాక్టరేట్‌ను ఇచ్చి గౌరవించిందన్నారు. దాదాపు ప్రపంచంలోని అన్ని అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్ ప్రత్యేక ప్రశంసలు అందించాయన్నారు.

## టీఆర్‌ఎస్ పార్టీని భూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలి : ప్రకాశ్‌గౌడ్



మణికొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులకు దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, నవంబర్ 21 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీలో టీఆర్ఎస్ పార్టీని భూత్‌స్థాయిలో బలోపేతం చేయాలని రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ టీఆర్ఎస్ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులంతా నిత్యం ప్రజల మధ్యనే ఉండాలని, వారి ఇబ్బందులు వేగంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజల కోసం పని చేసే వారైతేనే రాజకీయంలోకి రావాలని, పదవుల కోసం వస్తే టీఆర్ఎస్‌లో స్థానం లభించదని హెచ్చరించారు. ఈనెల 27.వ,తేదీన మణికొండ మున్సిపల్ విస్తృత స్థాయి సమావేశానికి పెద్ద ఎత్తున టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేసేలా నాయకులంతా సమిష్టిగా కష్టపడాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీ బలంగా ఉంటేనే ఎన్నికల్లో మనం ప్రజా ప్రతినిధులుగా గెలుపొందుతామని, పార్టీ అధిష్టానం ఆదేశించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. మాజీ ఎంపిపి తలారి మల్లేష్ ముదిరాజ్, మణికొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్ వసంత్ చౌహాన్, నవీన్ కుమార్, నాయకులు జయరాజ్, బషీర్, ధన్‌రాజ్, విఠల్, నరేందర్, రూపారెడ్డి పాల్గొన్నారు.

## ప్రేమించి మోసం చేశాడు.. కేసు నమోదు

బేగంపేట నవంబరు 21,ప్రభాతవార్త : నిన్ను ప్రేమిస్తున్నాను,నువ్వు ఒప్పుకుంటే పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో ఓ యువతిని నమ్మించాడు. శారీరక వాంఛ తీర్చుకున్నాడు.చివరికి పెళ్లి పేరెత్తగానే ముఖం చాటేసిన ప్రబుద్దుని ఉదంతంపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసారు. బేగంపేట అదనపు ఇన్స్‌పెక్టర్ డెబోరా కధనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బోరబండ అల్లాపూర్ క్రాస్‌రోడ్డు సమీపంలో నివాసం ఉండే మహ్మద్ ఖాలీద్ పాషా(28) మెడికల్ రిప్రజెంటివ్ గా పనిచేస్తుంటాడు. బోయిన్‌పల్లిలో ట్రైనీ నర్సుగా పని చేసే ఓ యువతిని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానంటూ వెంటపడ్డాడు. అతని ప్రేమను సదరు యువతి నిరాకరించింది. ఆమె స్నేహితుల ద్వారా ఫోన్‌నెంబర్ సేకరించిన పదే పదే ఆ యువతికి పాషా ఫోన్ చేస్తుండటంతో ఆమె ఫోన్ నెంబరు కూడా మార్చివేసింది. అయినప్పటికీ ఆ ఫోన్ నెంబరు ను కూడా తెలుసుకుని పలు రకాలుగా తన ప్రేమను వ్యక్త పరుస్తుండటంతో చివరకు అంగీకరించింది.ఈ క్రమంలో ఆమెను బేగంపేటలోని ఓ హోటల్ రూంకి తీసికెళ్లి శారీరక వాంఛ తీర్చుకున్నాడు. ఆతరు వాత నుంచి కనిపించకుండా పోయాడు. తనను వివాహం చేసుకోకుండా తప్పించుకు తిరుగుతున్న ఖాలిద్ పాషాపై చర్య తీసుకోవాలంటూ బాధితురాలు బేగంపేట పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మత్స్యకారుల మనుగడ పరిరక్షణలో ప్రభుత్వాలు విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న సత్తయ్య

సైఫాబాద్, నవంబరు 21 ప్రభాతవార్త: రాష్ట్రంలో మత్స్య సంపద-జలవనరులు-సాంప్రదాయ మత్స్యకారుల మనుగడ పరిక్షణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని ప్రభుత్వాల నూతన మత్స్య పారిశ్రామిక విధానాలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ స్టేట్ మత్స్యకార్మిక్ సంఘ్ (బిఎంఎస్) ప్రకటించింది. ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ్ ప్రతినిధులుఎర్ర సత్తయ్య, అమరనందా, రమేష్, కొప్పుల లక్ష్మణ్, రాజ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్యకారులను కోటీశ్వరులను చేస్తామని అసెంబ్లీలో ప్రగల్భాలు పలికిన రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ఆ మాట మరిచిపోయి జివొ నెంబరు 6 తీసుకువచ్చి మత్స్యకారుల అదాయానికి నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. మత్స్య దళారులకు మత్స్య పరిశ్రమలో ప్రవేశం కల్పించడానికి జివొ నెంబరు 4 తీసుకువచ్చి సాంప్రదాయ మత్స్యకారులకు ఉపాధి లేకుండా చేశారని వారు విమర్శించారు.

## జిని రామ్మూర్తి అకాల మరణం పట్ల దత్తాత్రేయ సంతాపం

సైఫాబాద్, నవంబరు 21 ప్రభాతవార్త: అఖిల భారత పద్మశాలి సంఘం మాజీ జాతీయ అధ్యక్షుడు జిని రామ్మూర్తి అకాల మరణం పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. జిని తనకు అత్యంత ఆత్మీయులని, బలహీనవర్గాల ప్రజల సమస్యలపట్ల అవగాన ఉన్న నాయకుడని చేనేత కార్మికుల సమస్యల పట్ల విశేష పరిజ్ఞానంతో అఖిల భారతస్థాయిలో కృషి చేశారని ఆయన కొనియాడారు. వారి సొసైటికి సంబంధించిన సమస్య లను తాను పార్లమెంట్ సభ్యునిగా, కేంద్ర మంత్రిగా ప్రాతి నిధ్యం వహించినప్పుడు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్య లు పరిష్కారానికి కృషి చేయడం జరిగిందని దత్తాత్రేయ గుర్తు చేశారు. రామ్మూర్తి అఖిల భారత పద్మశాలి సంఘానికి, సమాజానికి చేసిన సేవలు వెలకట్టలేనివని చెప్పారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ దత్తాత్రేయ భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్లు గవర్నర్ వ్యక్తిగత కార్యదర్శి కైలాస్‌నాగేష్ సోమవారం నాడిక్కడ పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజల సంక్షేమమే లక్ష్యం

**కార్పొరేటర్ మహాలక్ష్మీరామన్‌గౌడ్**



దగ్గరుండి రోడ్డుకు మరమ్మత్తు చేయిస్తున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, నవంబరు 21 ప్రభాతవార్త: హిమాయత్‌నగర్ డివిజన్‌లోని స్ట్రీట్ నెంబరు 6లో దెబ్బతిన్న రోడ్లుకు డివిజన్ కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మీరామన్‌గౌడ్ సోమవారం యుద్ధప్రాతిపదికన దగ్గరుండి మరమ్మత్తు చేయించడం జరిగింది. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి దగ్గరుండి పనులు చేయిస్తానని ఆమె చెప్పారు. ప్రజల సంక్షేమమే తన లక్ష్యమన్నారు. ప్రజల సంక్షేమానికి ఎంతటి త్యాగానికైన తాను సిద్ధమేనని ఆమె స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచిన ప్రజల సంక్షేమానికి పాటుపడానికి తాను ఎంత మాత్రంవెనుకాడబోనని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏరియా ఇన్‌స్పెక్టర్ శివ, బిజెపి నాయకుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే సాయన్న



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సాయన్న తదితరులు

కంటోన్మెంట్, నవంబర్ 21 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్య మంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే జి.సాయన్న తెలిపారు. బొల్లారం బజార్ అదర్శ నగర్‌లో నివాసం ఉంటున్న అందె శ్రీను అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం కోసం ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్ఓసి పత్రాన్ని ఎమ్మెల్యే సాయన్న చేతుల మీదుగా బాధితుడి కుమారుడికి అందజేశారు.

### రామ్‌నగర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా కంబర్తి శివమాదిగ

చిక్కడపల్లి, నవంబరు 21 ప్రభాతవార్త: బాగ్‌లింగంపల్లిలోని సంజీవ్‌నగర్ బస్తీ కమ్యునిటీ హాల్‌లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎంఆర్‌పిఎస్) ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ బుష్పాక గణేష్ మాదిగ హాజరయ్యారు. సంజీవ్‌నగర్ బస్తీకి చెందిన కంబర్తి శివమాదిగను ఎమ్మార్పీఎస్ రామ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా నియమించి అందుకు సంబంధించిన నియామకపత్రాలను అందించారు.

## గొందళి కుల సంఘానికి ప్రభుత్వం ఐదు ఎకరాల స్థలం కేటాయించాలి : ఏకనాథ్ దుస్గే



ఇంటింటి సర్వేలో పాల్గొన్న ఏకనాథ్ దుస్గే

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 21, ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం అన్ని కులాలకు ప్రాధాన్యత కల్పిస్తుందని అలాగే గొందలి కుల సంఘానికి ఐదు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించాలని తెలంగాణ గొందళి కుల సంఘం అధ్యక్షులు ఏకనాథ్ దుస్గే డిమాండ్ చేశారు. గొందళి కులస్తుల ఇంటింటి సర్వేలో భాగంగా జహీరాబాద్ నియోజకవర్గంలో గొందళి కులస్తుల ఇంటింటి సర్వే చేపట్టి వారి బాగోగులను అధ్యక్షులు ఏకనాథ్ దుస్గే వారి బృందంతో కలిసి వెళ్ళి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏకనాథ్ దుస్గే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కుల సంఘాలకు ఆత్మగౌరవం పేరిట 5 ఎకరాల ప్రభుత్వ భూమిలో కుల సంఘ భవనాలు అన్ని కులాలకు కేటాయించడం జరిగిందన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం గొందళి కులస్తులపై ప్రత్యేక చొరవ తీసుకొని తమకు కూడా అందరిలాగే రాజధాని నగరంలో ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలంలో భవనం నిర్మించి ఇవ్వాలని అధ్యక్షుడు ఏకనాథ్ దుస్గే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గొందళి సమాజ్ నాయకులు యు.సందీప్‌రావు, జి.దత్తు, పి.సంజయ్, డి.అశోక్, డి.తిలక్, జి.అంబదాసు, జి.దత్తు, జి.దీపక్, జి.అనిల్, నాగేష్, వి.గోవిందరావు, బి.రవీందర్, బి.బాబురావు, దత్తషిండే, డి.సంతురం తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక గ్యార్వీ

**మాజీ కార్పొరేటర్ శేషుకుమారి**



గ్యార్వీ వేడుకల్లో పాల్గొన్న శేషుకుమారి

సంజీవరెడ్డి నగర్, నవంబర్ 21, ప్రభాతవార్త : హిందూ ముస్లింల మధ్య సఖ్యతను పెంచడానికి గ్యార్వి ఉత్సవాలు దోహదపడతాయని మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి పేర్కొన్నారు. సోమవారం అమీర్‌పేట డివిజన్‌లోని బాపూనగర్‌లో బిఆర్ఎస్ మైనారిటీ నాయకులు ఆసిఫ్ నిర్వహించిన గ్యార్వి వేడుకలలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారితో కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కూతురు నరసింహ, కట్ట బలరాం, సచిన్ రాథోడ్ పాల్గొన్నారు.

## దేశంలో ఎక్కడలేని విధంగా సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



బోరబండ సైట్ 1లో దళిత బంధు ద్వారా మంజూరైన కారును లబ్దిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటిగోపినాథ్

యూసుఫ్‌గూడ, నవంబర్ 21, ప్రభాతవార్త : దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పేదలకోసం అనేక సంక్షేమ పతకాలను ప్రవేశపెడుతున్నారని హైదరాబాద్ జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులు జూబ్లీహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ అన్నారు. సోమవారం బోరబండ సైట్ 1 కాలనీలో దళిత బంధు పథకం ద్వారా మంజూరైన కారును టి సత్యనారాయణ పద్మలకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళితబంధు పతకం ద్వారా దళితుల జీవితాలలో వెలుగును నింపారన్నారు. ఈపతకం ద్వారా దళితులకు జీవనోపాదిని అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా బోరబండ సైట్ 3లో మరో లబ్దిదారునికి కారును, ఆటోట్రాలీని మరో లబ్దిదారునికి దళిత బంధు ద్వారా మంజూరైన జిరాక్స్ మిషన్, స్టేషనరీ షాప్‌ను ప్రారంభించారు. అనంతరం డివిజన్ పరిదిలోని సాయిబాబానగర్‌లో రూ.15లక్షల వ్యయంతో స్టోరేజి పైప్‌లైన్‌పనులకు శంకుస్థాపనచేశారు. ఈకార్యక్రమంలో డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు కృష్ణమోహన్, డివిజన్ కోఆర్డినేటర్ విజయ్‌సింహా, డివిజన్ టిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిరాజ్, లక్ష్మణ్‌గౌడ్, ధర్మ, బాబురావు, సత్తార్, మౌనిక, మనోహర్‌సాయి, జైభీమ్ యాదగిరి, బొట్టు శివ, ఆనంద్, రమేష్‌నాయక్, రాములు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీగణపతి దేవాలయంలో సుబ్రహ్మణ్యషష్టి పూజలు

చిక్కడపల్లి, నవంబరు 21 ప్రభాతవార్త: ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని లక్ష్మీగణపతి దేవాలయంలో వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో 27వ తేదీ నుంచి 29వ తేదీవరకు మూడు రోజుల పాటు పాటు సుబ్రహ్మణ్యషష్టిపూజలుంటాయని ఆలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఈవో పి.లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు ఉదయం 6 గంటలకు స్వామివారికి పంచామృత అభిషేకం, భస్మాభిషేకం, గంగాభిషేకం, అలంకరణ, అర్చనాది సేవా కార్యక్రమాలుంటాయని తెలిపారు. 29న ఉదయం సుబ్రహ్మణ్యషష్టి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అభిషేకాలు, మూడు రోజుల పాటు ఉదయం 9.30 గంటలకు సుబ్రహ్మణ్య మూలమంత్ర హోమం ఉంటుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

### ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో

## స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సం



ఉమామహేశ్వరస్వామి కళ్యాణమహోత్సవంలో హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి

పేట్‌బషీరాబాద్, నవంబర్21 ప్రభాతవార్త: కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి శ్రీఉమా మహేశ్వర ఆలయంలో ఉమామహేశ్వర కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ వేడుకకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, సురేష్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సంజయ్ సంజీవ్, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## రిఫ్రిజిరేషన్, ఏసీలపై విద్యార్థులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

నిజాంపేట్, నవంబర్21 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సోమవారం రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషన్ ఆపరేషన్ అండ్ ట్రబుల్ షటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం, నేషనల్ ఇంజనీరింగ్ సంస్థతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 300మంది విద్యార్థులకు పైగా పాల్గొన్నారు. విజ్ఞాన్ సంస్థల అధ్యక్షుడు దగ్గుబాటి సురేష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణలో ఫ్రిడ్జ్, ఏసీల విడిభాగాలు వాటి పనితీరు పై చిన్న చిన్న సమస్యలను ఇంట్లోనే పరిష్కరించే విధంగా శిక్షకులు విద్యార్థులకు నేర్పించారు. పరికరాల పనితీరు తెలుసుకోవడం వల్ల విద్యార్థులకు వాటిపై తగిన అవగాహన, ఆవిష్కరణ శక్తిని పెంపొందించుకోవచ్చునని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.బి. సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జె.ఎస్.రావు, ప్రధాన అధ్యాపకుడు డా.సి.డి.నాయుడు, డా.చెన్నకేశవరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై మాజీ కార్పొరేటర్ పర్యటన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

జీడిమెట్ల, నవంబర్ 21 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యలక్ష్మీ కాలనీలో సోమవారం మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అందులో భాగంగానే భాగ్యలక్ష్మీ కాలనీలో నూతనంగా పార్కును ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాలనీలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులు, మంచినీటి పైపులైన్లను ఏర్పాటు చేశామన్నారు. అంతేకాకుండా కాలనీ అభివృద్ధిలో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారుకు సూచించారు. అనంతరం హమీద్ బస్తీలో రూ.60లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మీ కాలనీ అధ్యక్షుడు సాగర్‌రెడ్డి, యాదగిరి, రామ్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

## భాగ్యనగర్ బ్యాగరి సంఘం కమిటీ ఎన్నిక



బాధ్యతలు స్వీకరించిన నూతన కమిటీ సభ్యులు

చాంద్రాయణగుట్ట, నవంబరు 21 ప్రభాతవార్త : పాతబస్తీ చాంద్రాయణగుట్ట నల్లవాగు భాగ్యనగర్ బ్యాగరి సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకొని బాధ్యతలు స్వీకరించారు. అధ్యక్షుడిగా పేరోజి సాయినాథ్, ఉపాధ్యాక్షులుగా పేరోజి ప్రదీప్ కుమార్, పేరోజి బాల్‌రాజ్, ,రొడ్డ అజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా పేరోజి వీరేంద్ర కుమార్, సంయుక్త కార్యదర్శిగా పేరోజి మహేశ్వర్, కోశాధికారులుగా పేరోజి సురేంద్ర కుమార్, రొడ్డ విజయ్ ధన్‌రాజ్, కార్యవర్గ సభ్యులుగా జయలక్ష్మి, ఆర్.సాయిలు, సత్తెమ్మ, రత్నమ్మ, అంజలి, సరిత, లక్ష్మి, భగీరథ బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు పేరోజి సాయినాథ్ మాట్లాడుతూ స్మశానవాటిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అధ్యక్షుడిగా ఎన్నుకున్న సంఘం సభ్యులకు సాయినాథ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## కబడ్డీ లీగ్ విజేతలకు బహుమతుల పంపిణీ

**ఆటలలో గెలుపు ఓటములు సర్వ సాధారణం : శ్యాంసుందర్‌రెడ్డి**



కోకాపేటలో కబడ్డీ లీగ్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న గంగిడి వెంకటరెడ్డి రాజమణి ట్రస్టు చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి

నార్సింగి, నవంబర్ 21 ప్రభాతవార్త : ఆటల పోటీలలో గెలుపు ఓటములు సర్వ సాధారణమని గంగిడి వెంకటరెడ్డి రాజమణి ట్రస్టు చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి పేర్కొన్నారు. కోకాపేట్‌లో వెంకట్‌రెడ్డి రాజమణి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ లీగ్ విజేతలకు సోమవారం బహుమతులు అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పోరేటర్ శివారెడ్డి, ట్రస్టు చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఆటల వలన శారీరక, మానసిక ఎదుగుదల సహజంగా జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఎదిగే వయసులో ఉన్న చిన్నారులతో తరుచూ ఆటలు ఆడించడం అత్యవసరమన్నారు. ఆటలతో గెలుపు, ఓటమి రెండింటిని సమానంగా స్వీకరించే గుణం అలవడుతుందన్నారు. గెలిచినప్పుడు పొంగిపోవడం, ఓడినప్పుడు కుంగి పోవడం చేయవద్దని సూచించారు. జీవితంలో ఎదురయ్యే ఓటములను కూడా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనే శక్తి మనలో పెరుగుతుందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులున్న విద్యార్థులకు ఇంటర్, డిగ్రీ వంటి ఉన్నత చదువులు మా ట్రస్టు ద్వారా శంషాబాద్‌లోని చైతన్య కళాశాలలో చదివిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు విశ్వనాథ్, లక్ష్మారెడ్డి, ప్రభాకర్, యాదగిరి, సునీల్, హరీష్, శ్రీకాంత్ శివ, నవీన్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# వనస్థలిపురం డివిజన్‌లోని పలు కాలనీల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**వనస్థలిపురం, నవంబరు 21 ప్రభాతవార్త :** వనస్థలిపురం డివిజన్‌లోని పలు కాలనీలో రూ. కోటి 78 లక్షల వ్యయంతో నిర్మించనున్న అభివృద్ధి పనులకు ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్‌రెడ్డి శంకుస్థాపనలు చేసారు. నాగార్జున కాలనీతో పాటు వివిధ కాలనీలో సిసి రోడ్లు, యుజిడి పనులకు రూ. 79.30 లక్షల వ్యయం, రూ. 37 లక్షలతో ఓంకార్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, రూ. 18.50 లక్షల వ్యయంతో వెంకటరమణ కాలనీలో సిసి రోడ్డు పనులు, ఏ టైప్ క్వార్టర్స్‌లో గల క్రీడా మైదానంలో రూ. 40.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనస్థలిపురం డివిజన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని, శివారు కాలనీలలో కూడా దశలవారిగా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ టిఆర్‌ఎస్ అధ్యక్షుడు చింతల రవికుమార్, మహిళాధ్యక్షురాలు గాండ్ల లలిత ఆనంద్‌రాజ్, వివిధ సంక్షేమ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరానగర్‌లో బస్తీ దవాఖానా ప్రారంభం : ఎమ్మెల్యే బేతి



ఇందిరానగర్‌లో బస్తీ దవాఖానా ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 21 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ ఇందిరా నగర్‌లో ఏర్పాటు చేసిన కొత్త బస్తీ దవాఖానాను సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్‌రెడ్డిలు ప్రారంభించారు. జిల్లా వైద్యాధికారి డా.పుట్ల శ్రీనివాస్, ఉప్పల్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. సౌందర్యలత, బోగ ప్రకాష్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొత్త బస్తీ దవాఖానాను ప్రారంభించి అందులో ప్రజలకు కల్పిస్తున్న మౌళిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనతంరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రజలకు ఇక నుంచి బస్తీ దవాఖానాలో పూర్తిస్తాయిలో వైద్య సేవలు ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. బస్తీ దవాఖానా ఏర్పాటు కోసం స్థానికుల ఎంతో కాలంగా వేచి చూస్తున్నారని, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం బస్తీ దవాఖానాలో పలు విభాగాలను ప్రారంభించి సదుపాయాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బస్తీ దవాఖానా వైద్యాధికారి డా.శ్రీవిద్య, స్టాప్ నర్స్ రేఖ, టిఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు వేముల సంతోష్‌రెడ్డి, మస్క సుధాకర్, గరిక సుధాకర్, పల్లె నర్సింగ్‌రావు, పిట్టల నరేష్, వంశీ, చిలుగూరి శ్రీకాంత్, యాదగిరిరెడ్డి, రాజు, భరత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు బాకారం లక్ష్మణ్, తోకట రాజు, జీవన్, మహేష్, ఒకాస్ నరసింహా, లింగంపల్లి రామకృష్ణ, అనిల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రాల చెరువు నుండి డిసిఎం అడ్డా తరలింపు చర్చలు సఫలం

## ఆర్‌సిఐ రోడ్డు పక్కన వాహనాలు నిలుపుకోవడానికి అసోసియేషన్ అంగీకారం



డిసిఎం ఓనర్స్ అసోసియేషన్‌తో మంత్రి సబితారెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 21 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని మంత్రాల చెరువు ఎదురుగా ఆర్‌సిఐ రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలంలోకి డిసిఎం అడ్డాను తరలించడానికి రాష్ట్ర విద్యాశాఖమంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి డిసిఎం ఓనర్స్ అసోసియేషన్‌తో జరిపిన చర్చలు సఫలీకృతమయ్యాయి. ప్రస్తుతం మంత్రాల చెరువు లోపల ఉన్న స్థలంలో చాలా సంవత్సరాలనుండి డిసిఎం యజమానాలు, డ్రైవర్లు వాహనాలను పార్కింగ్ చేస్తూ ఉపాధి పొందుతున్నారు. అయితే సదరు స్థలాన్ని అభివృద్ధి చేయాలని మంత్రి నిర్ణయించడంతో కొన్ని నెలల క్రితం డిసిఎం ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ నుండి నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ సమస్యపై దృష్టి సారించిన మంత్రి సోమవారం తనక్యాంపు కార్యాలయంలో డిసిఎం ఓనర్స్ అసోసియేషన్ వారితో చర్చలు జరిపి వారిని చెరువు సమీపంలోనే ఆర్‌సిఐ రోడ్డుకు ఒక వైపు ఖాళీ స్థలంలో వాహనాలు నిలుపుకొనే విధంగా ఒప్పించడంతో డిసిఎం ఓనర్లు, డ్రైవర్లు తమ అడ్డాను మంత్రి సూచించిన స్థలానికి తరలించడానికి సుముఖత వ్యక్తం చేశారు. అంతకు ముందు మంత్రి డిసిఎం వాహనాలు పార్కింగ్ విషయమై సంబంధిత పోలీసు అధికారులతో కూడా చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, టిఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు దీప్‌లాల్ చౌహాన్, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ చౌరస్తాలో శరవేగంగా స్కైవాక్ నిర్మాణ పనులు..!

## రూ.37 కోట్లతో పనులు : మరో నెల రోజుల్లో పూర్తి



ఉప్పల్ చౌరస్తాలో జరుగుతున్న స్కై వాక్ బ్రిడ్జి నిర్మాణ పనుల దృశ్యం



ఉప్పల్ చౌరస్తాలో నిరిస్తున్న స్కైవాక్ దృశ్యం

**ఉప్పల్, నవంబరు 21 ప్రభాతవార్త :** ఉప్పల్ చౌరస్తాలో అధునాతన హంగులతో నిర్మిస్తున్న స్కైవాక్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. సుమారు రూ.37 కోట్ల వ్యయంతో హెచ్‌ఎండిఏ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ స్కైవాక్ నిర్మాణంతో ఉప్పల్‌చౌరస్తాలో ఇక నుంచి పాదచారులకు ట్రాఫిక్ చిక్కులు తప్పనున్నాయి. ఏడాది క్రితం ప్రారంభించిన స్కైవాక్ బ్రిడ్జి పనులు ఉప్పల్ మెట్రో స్టేషన్ నుంచి అనుసంధానం చేస్తూ వరంగల్, రామంతాపూర్ రహదారులను కలుపుతూ నిర్మిస్తున్నారు. సుమారు 660 మీటర్ల ఉన్న స్కైవాక్ బ్రిడ్జి చుట్టూ నాలుగు వైపులా పాదచారులు వెళ్లే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉప్పల్ మెట్రో స్టేషన్ నుంచి నాలుగు వైపులా ఉన్న రోడ్ల వైపు నేరుగా వెళ్లేందుకు ఈ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ఇప్పటికే స్కైవాక్ నిర్మాణం కోసం పలు చోట్ల ఫిల్లర్లు నిర్మించారు. నాగోల్ వైపు బ్రిడ్జి నిర్మాణ పనులు చివరిదశకు చేరుకున్నాయి. వరంగల్, హబ్సిగూడ నుంచి వచ్చే దారిలో ప్రధాన ఫిల్లర్ల పనులు సాగుతున్నాయి. స్కైవాక్ నిర్మాణంతో ఉప్పల్ చౌరస్తా రూపురేఖలు మారిపోనున్నాయి. స్కైవాక్ పూర్తయిన తర్వాత పాదచారులు ఎక్కడపడితే అక్కడ రోడ్డు దాటకుంటా ఒకే దగ్గర నుంచి బయటికి వచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలు పూర్తిగా తగ్గుతాయని అధికారులు పేర్కొంటున్నారు. ఉప్పల్ చౌరస్తాలో ఇప్పటికే దీమ్ పార్కు, మరో వైపు స్కైవాక్, రింగ్‌రోడ్ పార్కు తదితర నిర్మాణాలతో చౌరస్తాలో రూపురేఖలు మారిపోతాయని పలువురు పేర్కొంటున్నారు. సిఎం కెసిఆర్, మంత్రి కేటిఆర్ ప్రత్యేక చొరవ తీసుకుని స్కైవాక్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

# శివసాయినగర్‌లో ఘనంగా కార్తీక మాస పూజలు



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

**సరూర్‌నగర్, నవంబర్ 21 ప్రభాతవార్త:** మీర్‌పేట్ పరిధిలోని శివసాయినగర్ కాలనీలోనున్న శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీలక్ష్మీ గణపతి దేవాలయంలో పవిత్ర కార్తీక మాసం పూజల సందర్భంగా సోమవారం గణపతి హోమం నిర్వహించారు. అదే విధంగా ఏకాదశ రుద్రాభిషేకం, మహిళల కుంకుమార్చన, లక్ష బిల్వార్చన, ఆకాశ దీపం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అంతే కాకుండా ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఛైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి, వెంకట కృష్ణారావు, వెంకట రమణలతో పాటు ఆలయ కమిటీ, కాలనీ సంఘం నాయకులు, వివిధ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ మహాసభల గోడ పత్రిక ఆవిష్కరణ

**హయత్‌నగర్, నవంబరు 21 ప్రభాతవార్త:** ఈనెల 27 నుంచి 29వరకు యాదగిరిగుట్టలో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ అబ్దుల్లాపూర్‌మెట్ మండల సమితి ప్రధాన కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్‌నాయక్ ఆధ్వర్యంలో కుంట్లూర్‌లో గోడపత్రికను విడుదలచేశారు. కార్యక్రమానికి హాజరైన సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు రవీంద్రాచారి మాట్లాడుతూ భవిష్యత్తు ఉద్యమ కార్యచరణను చేసుకోవడానికి, ప్రజా, కార్మిక సంక్షేమానికు విరుద్ధంగా కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ మెడలు వంచడానికి మహాసభలలో చర్చించనున్నట్లు వివరించారు.కార్యక్రమంలో నాయకులు దాసరి ప్రసాద్, వెంకన్న, వేణుగోపాలచారి, నర్సింహ పాల్గొన్నారు.



మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్‌లో రంగారెడ్డి జిల్లా 7200 మల్లన్న టీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా చైతన్య సమావేశంలో ప్రసంగిస్తున్న తీన్మార్ మల్లన్న: చిత్రంలో మీర్‌పేట్ కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు (సరూర్‌నగర్, ప్రభాతవార్త)

# నియోజకవర్గంలో వేగవంతంగా అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే బలాల



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల, అబ్రార్

**మలక్‌పేట, నవంబరు 21 ప్రభాతవార్త :** మలక్‌పేట నియోజకవర్గంలో వేగవంతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. అజంపుర డివిజన్‌లోని ఫర్హత్‌నగర్, బోద్ అలీషకిడికి, అజంపురం వార్డు కార్యాలయం సమీపంలోని మార్కజ్‌లెన్, కాలడేర తదితర ప్రాంతాలలో డివిజన్ ఎంఐఎం నాయకుడు అబ్రార్‌తో కలిసి రూ. కోటి 54 లక్షలతో సిసి రోడ్లు, ప్రహారీ నిర్మాణ పనులను ప్రారంభించడంతోపాటు నిర్మాణం పూర్తయిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. అదే విధంగా రూ. 10 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారిగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఇ మహబూబ్‌మియా, డిఇ ప్రదీప్, ఎఇ మల్లికార్జున్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్, మహేష్, ఖైసర్ తదితరులు పాల్గొన్నారు.

# లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత : ఎమ్మెల్యే బేతి



హబ్సిగూడలో లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**ఉప్పల్, నవంబరు 21 ప్రభాతవార్త :** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిరుపేద జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం హబ్సిగూడ క్యాంపుకార్యాలయంలో తహసీల్దార్ కె.గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉప్పల్ మండల పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన లబ్దిదారులకు స్థానిక కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, ప్రభుదాస్, దేవేందర్‌రెడ్డి, శాంతిసాయి జెన్ శేఖర్ తదితరులతో కలిసి చెక్‌లు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఆడబిడ్డలకు సిఎం కెసిఆర్ ఎంతో పెద్దన్నలాగా వ్యవహరిస్తూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. గత ఎనిమిది సంవత్సరాలలో కల్యాణలక్ష్మి పథకం ద్వారా సుమారు 11లక్షల మందికి రూ.పదివేల కోట్ల సహాయం అందజేసినట్లు తెలిపారు. నాచారంలో31 మందికి, మల్లాపూర్‌లో 37 మందికి, మీర్‌పేటలో 29 మందికి, ఉప్పల్‌లో 57 మందికి, చిలుకానగర్‌లో 29 మందికి, హబ్సిగూడలో ఐదు మందికి, రామంతాపూర్‌లో 97 మందికి చెక్‌లు అందజేశారు. మొత్తం 285 మందికి చెక్‌లు అందజేసినట్లు తహసీల్దార్ గౌతమ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ ఎం.డి. రఫీ, ఆర్ఐ సుధ, నహిద, అజీమ్, సీనియర్ అసిస్టెంట్ అనంతరాములు, నాగలక్ష్మి, నరసింహా, సుమన్, టిఆర్‌ఎస్ నాయకులు గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, పల్లె నర్సింగ్‌రావు, రవీందర్‌రెడ్డి, ఎం.డి.రఫీక్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా శాఖా మంత్రిని బర్తరఫ్ చేయాలని సిఎం కెసిఆర్‌కు లేఖ



లేఖ చూపిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

**ఎల్.బి.నగర్, నవంబర్ 21 ప్రభాతవార్త :** విద్యా వ్యవస్థ దుర్భరంగా మారుతోందని విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలని కోరుతూ సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్‌కుమార్ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాశారు. ప్రభుత్వ విద్యాలయాలలో ఉపాధ్యాయుల కొరత, అపరిశుభ్రత, మంచి నీరు, మరుగుదొడ్లు, మౌలిక వసతులు లేవని లేఖలో పేర్కొన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మంత్రిని బర్తరఫ్ చేయాలని లేఖలో కోరారు.

# మండల వ్యవసాయ కార్మిక సంఘం ఏకగ్రీవ నూతన కమిటీ



మండల సదస్సులో మాట్లాడుతున్న జంగయ్య తదితరులు

**అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 21 ప్రభాతవార్త:** అబ్దుల్లాపూర్ మెట్ మండల తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభనిర్వహించి మండల నూతన వ్యవసాయ కార్మిక కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.జంగయ్య హాజరై మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఇళ్లస్థలాలు, భూముల విషయంలో అనేక పోరాటాలు చేస్తుందన్నారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గత ప్రభుత్వాలు పేదవాళ్లకు ఇచ్చిన భూములను గుంజుకొని హెచ్‌ఎండిఎ కింద ప్లాట్లు చేసి కోట్ల రూపాయలు గడిస్తుందని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా 493 జీవో తీసుకువచ్చి, ఇళ్లస్థలాలు ఇవ్వకుండా చేసిన జీవోని రద్దు చేయాలన్నారు. వీరందరికీ వ్యవసాయ కార్మిక సంఘం అండగా ఉంటుందని అన్నారు.అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా అబ్బగోని శోభారాణి,ప్రధానకార్యదర్శిగా కిరణ్, మైసమ్మ, లావణ్య, లలిత, ఐలమ్మ, బిక్షపతి మొత్తం 11 మందిని నూతన కమిటీ ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మంగళపల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ : ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

**అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 21 ప్రభాతవార్త:** అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలోని శివ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట్ తుర్కయంజాల్ మున్సిపాలిటీలకు చెందిన 143మంది లబ్ధిదారులకు రూ.14,316,588 విలువగల కళ్యాణలక్ష్మీ -షాదీ ముబారక్ చెక్కులను ఆయా మండల, మున్సిపాలిటీల ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదింటి ఆడపిల్లలకు తెలంగాణ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లాంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి కళ్లలో ఆనంద వెల్లివిరిసేలా చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బూర రేఖ, ఎమ్మార్వో అనిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రాధాన్యత క్రమంలో నిధుల కేటాయింపు : ఛైర్‌పర్సన్ స్వప్న



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఛైర్‌పర్సన్ స్వప్న తదితరులు

**హయత్‌నగర్, నవంబరు 21 ప్రభాతవార్త:** సమస్యల తీవ్రతను బట్టి ప్రాధాన్యత క్రమంలో నిధులను కేటాయించి అన్ని వార్డులలో అభివృద్ధి పనులను పూర్తిచేస్తున్నామని పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటి ఛైర్‌పర్సన్ చెవుల స్వప్న, కమిషనర్ రామాంజులరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధి 4వ వార్డులో 16 లక్షలతో వేయనున్న సీసీరోడ్డు పనులతో పాటు 6 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఓపెన్ స్పేస్ డెవలప్‌మెంట్ పనులను కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావతి విజేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీరు, డ్రైనేజీ పనులను ప్రథమ ప్రాధాన్యతను ఇస్తున్నట్లుగా వివరించారు. అవి పూర్తయిన తరువాత సీసీరోడ్లను వేయిస్తున్నామని తెలిపారు. ప్రజలు తడి, పొడిచెత్తను వేరు చేసి చెత్తరిక్షాలలో వేయాలని తద్వారా మెరుగైన పారిశుధ్య సాధనకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దండెం కృష్ణారెడ్డి, పసుల రాజేందర్, సిద్ధంకి కృష్ణారెడ్డి, నాయకులు పండుగుల రాజు పాల్గొన్నారు.

# రాగన్నగూడ కార్యాలయంలో కౌన్సిల్ రివ్యూ సమావేశం



కౌన్సిల్ రివ్యూ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ అనురాధ, వైస్ ఛైర్‌పర్సన్ హరితాధన్‌రాజ్ తదితరులు

**తుర్కయంజాల్, నవంబరు 21 ప్రభాతవార్త:** రాగన్నగూడ వార్డుకార్యాలయంలో ఛైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ రివ్యూ సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో ఎలక్ట్రికల్, వాటర్‌కి సంబంధించిన అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ 24 వార్డుల్లో ఇబ్బందులు లేకుండా ప్రతి ఇంటికి మంచినీళ్లు అందేలా చూస్తామని, అదేవిధంగా విద్యుత్ సంబంధించిన లైటింగ్,స్తంభాలు ఏర్పాటు, ప్రతి వార్డులో సమస్యలు లేకుండా అభివృద్ధి పనులు చేపడతామని ఆమె తెలిపారు. అదే విధంగా కమ్మగూడ ఇంద్రమ్మ కాలనీలో జరుగుతున్న వాటర్ లైన్, రోడ్డు ఎత్తు పెంచడంతో సంబంధిత కాలనీవాసులు అభ్యంతరం మేరకు ఛైర్‌పర్సన్ అనురాధ, వైస్ ఛైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్‌గౌడ్, మున్సిపాలిటీ కమిషనర్ ఎంఎన్‌ఆర్ జ్యోతి, అధికారులతో కలిసి పనులను పరిరక్షించారు. కాలనీలో ఇంటి కడప కంటే పైగా రోడ్లు వేయడం మంచిది కాదని, ఎత్తు లేపడంవల్ల వర్షాకాలం వస్తే ఇబ్బందులు తలెత్తుతాయని రోడ్డు ఎత్తు తగ్గించి వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికి డబుల్ బెడ్ రూమ్‌లు కేటాయించాలని ధర్నా



ఉప్పల్ రెవెన్యూ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తున్న ఐద్వా,సిఐటియు నేతలు

**ఉప్పల్, నవంబరు 21 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా సోమవారం ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రజా సంఘాల పోరాట వేదిక, ఐద్వా, సిఐటియు, ఎస్‌ఎఫ్‌ఐ, రజక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఐద్వా మహిళా జిల్లా కార్యదర్శి ఎం.వినోద, సిఐటియు ఉప్పల్ కార్యదర్శి జె.వెంకన్న, రజక సంఘం కార్యదర్శి జి.ఉపేందర్ మాట్లాడుతూ ఉప్పల్ సర్కిల్‌లో 2014లో డబుల్ బెడ్‌రూమ్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలకు ఇంత వరకు ఇళ్లు కేటాయించలేదని పేర్కొన్నారు. అర్హులందరికి వెంటనే ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఆఫీస్ సబార్డినేట్‌కు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాయత్రి, పద్మ, సంతోష్, లక్ష్మణ్, రామ్‌కోటి, పంతు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్‌కు తగిన ప్రాధాన్యత ఇవ్వాలి : కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

## ఒంటెద్దు పోకడలతో ఎమ్మెల్యే వ్యవహారం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్పొరేటర్ తదితరులు

**వనస్థలిపురం, నవంబరు 21 ప్రభాతవార్త :** ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అభివృద్ధి పనుల విషయంలో ప్రొటోకాల్ పాటించడంలేదని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం డివిజన్‌లో జరిగిన అభివృద్ధి పనుల శంకుస్థాపన విషయంలో తనకు సమాచారం ఇవ్వకపోవడంపై తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ రెండు పర్యాయాలు కార్పొరేటర్‌గా, ఎమ్మెల్యేగా సుదీర్ఘ అనుభవమున్న సుధీర్‌రెడ్డి కార్పొరేటర్లనుపిలువకుండా శంకుస్థాపన చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. అభివృద్ధి పనుల విషయంలో రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన ఎమ్మెల్యే కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నాడని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. నిత్యం కాలనీలో పర్యటిస్తూ, సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందించడం జరిగిందన్నారు. అధికారులు కూడా ఎమ్మెల్యేకు వత్తాసు పలుకుతున్నారని అన్నారు. సోమవారం శంకుస్థాపనలు పెట్టుకుని ఆదివారంసాయంత్రం తనకు సమాచారం ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ సమావేశంలో బిజెపి కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాసరావు, అధికార ప్రతినిధి తడకమళ్ల విజయ్‌కుమార్, జనార్ధన్‌రెడ్డి, యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్ప మహా పడి పూజ



పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రఘుగౌడ్ తదితరులు

**మలక్‌పేట, నవంబరు 21 ప్రభాతవార్త :** అయ్యప్ప మహా పడి పూజ కార్యక్రమం చంచల్‌గూడలో ఘనంగా నిర్వహించారు. గురుస్వామి కొత్త రఘుగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పడి పూజ కార్యక్రమానికి వందలాది మంది అయ్యప్ప స్వాములు విచ్చేసారు. శబరిమల క్షేత్రం అలంకరణతో అయ్యప్పస్వామి మహా పడిపూ, పల్లకి సేవా కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. అయ్యప్పకు పంచామృతంతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. భజన మండలి అయ్యప్ప నామ స్మరణలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త,నాయకులు అంజన్‌కుమార్ యాదవ్, అనిల్‌కుమార్‌యాదవ్, పొన్నం ప్రభాకర్, సామ ప్రభాకర్‌రెడ్డి, కొత్తకాపు రవీందర్‌రెడ్డి, జి.బాలకృష్ణయాదవ్, వంజరి వినోద్‌కుమార్, కొత్త నగేష్, కొత్త శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సబితారెడ్డి చొరవ వల్లే జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి



మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న రవూఫ్, ఖైసర్ బామ్

**సరూర్‌నగర్, నవంబర్ 21 ప్రభాతవార్త:** మంత్రి సబితారెడ్డి వల్లే జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతున్నదని మున్సిపల్ టిఆర్‌ఎస్ నాయకులు ఖైసర్ బామ్, షాకీర్, అబ్దుల్ రవూఫ్‌లు స్పష్టం చేశారు. మున్సిపాలిటీలో మంత్రి చొరవతో రూ.3.25 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు పూర్తయిననేపథ్యంలో వారు సోమవారం మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనారిటీ ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో మంత్రి ప్రత్యేక చొరవ చూపుతుండడం హర్షణీయమని అన్నారు. సబితారెడ్డి సహకారంతోనే మున్సిపాలిటీలోని దాదాపు చాలా బస్తీలు, కాలనీలకు మౌళిక సదుపాయాల కల్పన జరిగిందని వారు వెల్లడించారు. ఈ మేరకు వారు మున్సిపాలిటీ ప్రజల తరపున మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# చిలుకానగర్ స్మశానవాటిక పనుల పరిశీలన : బన్నాల గీత



చిలుకానగర్ స్మశానవాటిక పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్,నవంబరు 21ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లోని స్మశానవాటికలో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం డివిజన్ పరిధిలోని స్మశానవాటికలో ఇటీవల నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి పరిశీలించి సూచనలు చేసిన విషయం తెలిసిందే. దీంతో మున్సిపల్, జలమండలి అధికారులతో కలిసి స్మశానవాటికలో కార్పొరేటర్ బన్నాల గీత పనులు పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చిలుకానగర్ జనరల్ స్మశానవాటికలో మురుగునీటి సమస్య తొలగించి బాత్‌రూమ్‌లకు డోర్‌లు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మురుగునీరు లోపలికి రాకుండా అరికట్టినట్లు తెలిపారు. బాత్‌రూమ్‌లకు మరమ్మతులు చేపట్టేందుకు కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి జిఎం జాన్‌షరీఫ్, డిజిఎం రజనీకాంత్‌రెడ్డి, సత్యనారాయణ, శానిటేషన్ డిఇ చందన, మున్సిపల్ డిఇ నిఖిల్‌రెడ్డి, ఎఇ రాజ్‌కుమార్, టిఆర్‌ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కె.జగన్, బింగి శ్రీనివాస్, పుష్పరాజ్, శ్రీకాంత్, బాలు తదితరులు పాల్గొన్నారు.